క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన పలమనేరు ఆర్డీఓ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పలమనేరు నూతన ఆర్డీఓ వెంకటేశ్

చిత్తూరు కలెక్టరేట్: నూతనంగా జిల్లాకు విచ్చేసిన పలమనేరు ఆర్డీఓ వెంకటేశ్ బుధవారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలమనేరు డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలు, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.

ఏఆర్ ఏఎస్పీగా శివానంద కిషోర్



చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పోలీ సుశాఖ ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) ఏఎస్పీగా ఆర్.శివానంద కిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నాగేశ్వర రావు స్థానంలో తిరుమల విజిలెన్స్‌లో డీఎస్పీగా ఉన్న శివానంద కిషోర్‌కు పదోన్నతిపై చిత్తూరుకు బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎస్పీ మణికంఠను కలిసిన ఏఎస్పీ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

ప్రభాస్ అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న అభిమానులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో బుధవారం సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలను ఆ అభిమానులు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని రక్తదాన కేంద్రంలో పలువురు అభిమానులు రక్తం దానం చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాజేష్, తులసీకృష్ణ, సాయి, హరితేజ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మేము సైతం



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న ప్రిన్సిపల్

ఐరాల: వరద బాధితుల సహాయార్థం రూ.25,796 చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి బుధవారం ఎమ్మెల్యే మురళీమోహన్‌కు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయ్ కుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జలాశయానికి పూజలు



జలాశయానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు సమీపంలోని పెనుమూరు మండలంలో ఉన్న కలవకుంట ఎన్టీఆర్ జలాశయానికి బుధవారం పూజలు నిర్వహించారు. ఇక్కడున్న ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీళ్లు రావడంతో చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్‌మోహన్ నాయుడు, మురళీ మోహన్ కలిసి జలహారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం దిగువ భాగానికి నీళ్లను గేటు తెరిచి వదిలారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకు వైద్యసేవలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: గ్రామాల్లో ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలను అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి అనూష తెలిపారు. 197 రామాపురంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలోకి వైద్య సేవలు తీసుకువచ్చినట్లు తెలిపారు. అనంతరం షుగర్, బీపీ, గర్భవతులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సిబ్బంది సరస్వతి, దివ్య, శశి, అనురాధ పాల్గొన్నారు.

సరుకుల్లో కోతలు

- మొన్న కందిపప్పు.. నేడు వంటనూనె
- అంగన్‌వాడీలకు అందని వైనం
- నిర్వహణ కార్యకర్తలకు భారం



అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలు, సరుకులు

చిత్తూరు రూరల్: గర్భిణులు, బాలింతల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పౌష్టికాహార లోపంతో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గత ప్రభుత్వంలో గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా బెల్లం, వేరుశనగ చిక్కీలు, రాగి పిండి, అటుకలు, ఖర్జూరంతో పాటు, ఐదు లీటర్ల పాలు, కిలో కందిపప్పు, అర లీటర్ వంట నూనెను ఇంటి వద్దకే అందించే వారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెల ఏదో ఒక సరుకు సరఫరాలో జాప్యం చేయడమో లేదంటే పూర్తిగా నిలిపివేయడమో చేస్తోందని మహిళలు వాపోతున్నారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయాల్సిన వంట నూనెను అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేయలేదు. ఒక నెలలో ఏవైనా సరుకులు సరఫరా చేయకపోతే మరుసటి నెలలో సరుకులు ఇవ్వడం పరిపాటి. అయితే రెండు నెలల నూనె లబ్ధిదారులకు అందజేస్తుందనుకుంటే, కానీ కూటమి ప్రభుత్వం అక్టోబర్ నెలకు సంబంధించి మాత్రమే వంట నూనె పంపిణీ చేసింది. గత నెలలో ఇవ్వాల్సిన నూనె గురించి అంగన్‌వాడీ కార్యకర్తలను లబ్ధిదారులు అడుగుతుంటే, ప్రభుత్వం ఈ నెల వరకే సరఫరా చేసిందని, గత నెలకు సంబంధించి నూనె సరఫరా కాలేదని చెబుతున్నారు. తాము ఎక్కడ నుంచి తెచ్చేదని బదులిస్తుండడంతో లబ్ధిదారులు మండిపడుతున్నారు.

నిర్వహణ కష్టతరం

ప్రభుత్వం మార్పుతో అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణ కష్టతరంగా మారుతోంది. నిర్వహణను, సేవల అమలును ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. నోటుపుస్తకాలు ఇవ్వకపోగా, సరుకుల్లో కోత పెట్టడంతో కార్యకర్తలకు తలకు మించిన భారమవుతోంది. కుటుంబ నిర్వహణే వారికి కష్టంగా ఉంటే, దీనికి తోడు కేంద్ర నిర్వహణ అప్పుల పాలు చేస్తోంది. సరుకుల కోత సమయంలో అప్పు చేసి లబ్ధిదారులకు పప్పుకూర వడ్డిస్తున్నారు. కొన్ని సెంటర్లల్లో చేతులెత్తేస్తున్నారు. దీనికి తోడు కొన్ని బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగడంతో కార్యకర్తలు అల్లాడిపోతున్నారు. రుచికరమైన భోజనం వడ్డించలేకపోతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కందిపప్పుకు బ్రేకులు వేసింది. ఈ దెబ్బతో కొన్నాళ్లు పప్పుకు అంగన్‌వాడీ కేంద్రాలు దూరమయ్యాయి. కొంత మంది అంగన్‌వాడీ కార్యకర్తలు అప్పులు చేసి పరువు కాపాడుకున్నారు. మళ్లీ మధ్యలో వంట నూనెకు కోత పెట్టడంతో చేతులు కాల్చుకున్నారు. ఇంకా ఏ సరుకులు కోత పెడతారోనని అంగన్‌వాడీ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. రుచికరమైన భోజనం అందక పోవడంతో లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాల వైపు ముఖం చాటేస్తున్నారు. సరుకులు ఇంటికి తీసుకెళ్లే గర్భిణులు, బాలింతలు మాత్రం అప్పుడప్పుడు సరుకులకు కోత వేస్తుండడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు మింగేస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల లబ్ధిదారులు చీవాట్లు పెడుతున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. ఇక అంతంత మాత్రంగా వెళ్లే పిల్లలు సైతం తాము వెళ్లం అంటూ మారాం చేస్తున్నారు.

బాలింతలకు అందని సరుకులు

చిత్తూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 227 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,123 మంది గర్భిణులు, 1059 మంది బాలింతలు, 9,344 మంది పిల్లలు ఉన్నారు. సెప్టెంబర్‌లో పలు కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయాల్సిన వంట నూనె సరఫరా కాలేదు. వీరికి ఒక్కొక్కరికీ నెలకి అర లీటరు వంట నూనె ఇవ్వాలి. సెప్టెంబర్ నెలలో వంట నూనె సరఫరా చేయక పోవడం వల్ల రూ.30 వేల వరకు ప్రభుత్వం మిగుల్చుకుంది. గర్భిణులు, బాలింతలకు ఇచ్చే సరుకుల్లో కూడా కోతవిధిస్తూ కూటమి ప్రభుత్వం నిధులు మిగుల్చుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లబ్ధిదారులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం

ఐదు హెక్టార్లలో పంట నష్టం

చిత్తూరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు చిత్తూరు మండలంలో ఐదు హెక్టార్లల్లో వరి పంట నష్ట పోయినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి వేణు తెలిపారు. వర్షానికి దెబ్బతిన్న పంట మొత్తం కోత దశకు వచ్చిందన్నారు. నష్ట పోయిన పంట వివరాలను సేకరిస్తున్నామన్నారు. వివరాల సేకరణ పూర్తయిన తర్వాత నవంబరు 2వతేదీ జరిగే సోషల్ ఆడిట్‌లో ఆ రైతుల వివరాలను ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

వేధించడం తగదు



మాట్లాడుతున్న సురేంద్ర

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రాజకీయంగా కొంతమంది వేధించడం తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర తెలిపారు. స్థానిక యూనియన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులకు పలు ప్రాంతాల్లో డ్యూటీలు వేయవద్దని వేధించడం సరికాదన్నారు. ఈ నెల 26న సీపీఎం జిల్లా మహాసభల సందర్భంగా జరగనున్న ర్యాలీలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు, నాయకులు గిరిధర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై మురుగు..రాకపోకలకు బేజారు



అందారెడ్డిపల్లె వద్ద జాతీయరహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ అందారెడ్డిపల్లె వద్ద మురుగు నీరు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపైనే ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, ద్విచక్రవాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలలుగా మురుగునీరు ప్రవహిస్తుండడంతో రోడ్డు దెబ్బతిని వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. రహదారిపై మురుగు నీరు ప్రవహించడంవల్ల ఇబ్బందిగా ఉందని పలుమార్లు పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలంటూ ఆందోళన చేపట్టినా చలనంలేదని మహిళలు పేర్కొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రైతులు సస్యరక్షణ పద్ధతులతో పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ వరలక్ష్మి తెలిపారు. మండలంలోని ఇరువారంపల్లె రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. కోసిన పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పెట్టుబడులను సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలన్నారు. ఏటా ఒకే పంట కాకుండా పంట మార్పిడి అనుసరించాలని సూచించారు. వరిసాగులో రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పైరును కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు ఆశించే ప్రమాదం ఉందని ముందస్తుగానే రైతులు జాగ్రత్తలు తీసుకుని పంటను కాపాడుకోవాలని తెలిపారు. మోతాదుకు మించిన ఎరువులు, పురుగు మందులతో పంటను పాడుచేసుకోవద్దని కోరారు. వీఏఏ మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం

పలమనేరు : జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలుగా సీతాఫలం, జామ, జీడిమామిడి, ఉసిరి, చింత పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందని జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైతుసేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరై రైతులకు అవగాహన కల్పించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ ప్రోత్సాహకంగా హెక్టారుకు రూ.18 వేల నుంచి 25 వేల దాకా అందిస్తుందని తెలిపారు. ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అయిదెకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ, పెద్దరైతులకు 45 శాతంతో బిందు సేద్య పరికరాలను అందిస్తామన్నారు.

టపాకాయల విక్రయానికి స్థల పరిశీలన



బంగారుపాళెంలో టపాకాయల విక్రయానికి స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్

బంగారుపాళెం: టపాకాయల విక్రయం కోసం తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ బుధవారం స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో టపాకాయలు విక్రయించేందుకు లైసెన్సుదారులకు అనుమతి ఇచ్చారు. గతంలోనూ ఇక్కడే టపాకాయల విక్రయాలకు అనుమతించిన విషయాన్ని గుర్తుచేశారు. మండలంలో ఆరు దుకాణాలు ఏర్పాటు కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు వివరించారు. దుకాణదారులు నిబంధనలు పాటించి టపాకాయలు విక్రయించాలని సూచించారు. తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ పునీత్ పాల్గొన్నారు.

చిత్తూరు కార్పొరేషన్ ఏసీపీగా నాగేంద్ర



చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా నాగేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏసీపీగా పనిచేస్తున్న ఈయన్ను చిత్తూరుకు, ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణుడిని పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేశారు. బాధ్యతలు తీసుకున్న తరువాత నాగేంద్ర, స్థానిక మేయర్ అముద, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు, కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

భూ రీసర్వేలోని సమస్యలు పరిష్కరిస్తాం

తవణంపల్లె: భూ రీసర్వేలోని సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మండలంలోని టి.పుత్తూరులో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. రీసర్వేలో ఏవైనా తేడాలుంటే విన్నవించాలని కోరారు. కొలతల్లో ఏవైనా లోపాలకు సంబంధించిన రికార్డులతోపాటు అర్జీలు ఇస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గ్రామ సభలో భూ సమస్యలపై 48 అర్జీలను రైతులు సమర్పించారు. కార్యక్రమంలో వీఆర్ఓ రాజశేఖర్, సచివాలయ సర్వేయర్ తేజ రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



వెంకటరమణ (ఫైల్)

ఐరాల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.వెంకటరమణ(61) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. ఎస్ఐ బుధవారం మాట్లాడుతూ 1991లో ఏఆర్ కానిస్టేబుల్‌గా వెంకటరమణ విధుల్లో చేరారని చెప్పారు. 2011లో సివిల్ కానిస్టేబుల్‌గా కన్వర్షన్, 2023 నుంచి ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. చిత్తూరు రాంనగర్‌కాలనీలో నివాసముంటున్నారని పేర్కొన్నారు. అయితే గత కొంత కాలంగా అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ కన్ను మూసినట్లు తెలిపారు. మరో ఐదు నెలల్లో విరమణ పొందనున్న ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చీడల నుంచి పంటలను రక్షించుకోవాలి



కందిపంటను పరిశీలిస్తున్న ఏఓ మాధవి

గుడిపాల: రైతులు వ్యవసాయంలో సస్యరక్షణ పద్ధతులు పాటించి పంటలను చీడ పురుగుల నుంచి రక్షించుకోవాలని ఏఓ మాధవి సూచించారు. మండలంలోని తిమ్మయ్యపల్లె, రాగిమానుపట్టెడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు. కందిపంటను పరిశీలించి తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. సిబ్బంది సోనియా, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

బంగారుపాళెం: భూముల రీసర్వేలో చోటుచేసుకున్న సమస్యలను పరిష్కరించేందు కోసమే గ్రామ సభలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని బేరిపల్లెలో బుధవారం గ్రామ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భూ రీసర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అనంతరం రైతుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ బాబు, మండల సర్వేయర్ లావణ్య, వీఆర్ఓ హేమచంద్ర, విలేజ్ సర్వేయర్ డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వారికి సామాజిక పింఛన్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. స్థానిక లెనిన్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నగరశివారు ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హత కలిగిన వారికి కొత్తగా పింఛన్లు ఇవ్వాలన్నారు. లెనిన్‌నగర్, మంగసముద్రం, ప్రశాంత్‌నగర్, ఎస్టేట్, తేనెబండ, దొడ్డిపల్లె, మురకంబట్టు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కాలనీల్లో రోడ్లు, కాలువలు, వీధిలైట్ల ఏర్పాటుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు పేదల సమస్యలను జోక్యం చేసుకుని పరిష్కరించాలన్నారు. మంగసముద్రం హౌసింగ్ కాలనీకి హైవే రోడ్డు నుంచి రావడానికి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు మణి, సత్యమూర్తి, విజయ్ కుమార్, విజయగౌరీ, రమాదేవి, కాలనీవాసులు రాజేంద్రన్, సంతోష్ బషీర్, కార్తీక్, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తప్పనిసరి



గొర్రెలకు నట్టల మందు తాగిస్తున్న పశు వైద్య సహాయ సిబ్బంది

ఐరాల: వర్షాలకు గొర్రెలు, మేకలకు వ్యాధులు ప్రబలకుండా నట్టల నివారణ మందు తప్పనిసరిగా తాగించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మావతి అన్నారు. మండల వ్యాప్తంగా బుధవారం జీవాలకు పశు వైద్య సహాయ సిబ్బందితో జీవాలకు నట్టల నివారణ మందును తాపించారు. ఆమె మాట్లాడుతూ కురుస్తున్న భారీ వర్షాలకు వివిధ రకాల వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా నట్టల నివారణ మందు తాగిస్తున్నట్లు వివరించారు. సకాలంలో మందులు తాగించకుంటే జీవాలు మృతి చెందే అవకాశం ఉందన్నారు. 1000 జీవాలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టి చేతులకు శుభ్రత కరువు

- పాఠశాలల్లో కానరాని శుభ్రత కిట్లు
- పట్టించుకోని ఉపాధ్యాయులు
- తరచూ కడుపునొప్పితో బాధపడుతున్న విద్యార్థులు





గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్), మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

గుడిపాల: భోజనం చేసిన తరువాత చేతులు ఏ విధంగా శుభ్రంగా చేసుకుంటామో.. భోజనానికి ముందు కూడా శుభ్రం చేసుకోవాలి. ప్రతి చోటా మనకు కనిపించని సూక్ష్మజీవులు ఉంటాయి. ఎక్కడ పడితే అక్కడ చేతులు పెడుతుంటాం. తినే ముందు చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల సూక్ష్మజీవులు ఆహారం ద్వారా శరీరంలోకి ప్రవేశించి వ్యాధులు కలగజేస్తాయి. ముఖ్యంగా చిన్నారులు రోజంతా మట్టిలో ఆడుతూ ఉంటారు. వీరు చేతులు కడుక్కోకుండా ఆహారం తినడం వల్ల అనారోగ్యానికి గురవుతారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పాఠశాలల్లో చేతుల శుభ్రత పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా చిన్నారులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినేముందు చేతులు శుభ్రం చేసుకోవడానికి వీలుగా సబ్బులు, నాప్‌కిన్‌లు అందజేస్తారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఈ పథకం అమలుపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో చాలా పాఠశాలల్లో పథకం అమలు చేయడం లేదు.

చేతుల శుభ్రతపై నిర్లక్ష్యం

నియోజకవర్గంలో చిత్తూరు, గుడిపాల మండలాల్లో 188 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 12,350 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. అయితే భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకునేందుకు పాఠశాలలో నీటి సదుపాయం లేకపోవడం గమనార్హం. మరి కొన్ని చోట్ల సబ్బులు, నాప్‌కిన్‌లు అందుబాటులో ఉంచడంలేదు. దీంతో విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోకుండానే భోజనం చేస్తున్నారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాల్సిన ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతి పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకునేందుకు వీలుగా సబ్బులు, నీరు, బకెట్, మగ్గు, నాప్‌కిన్‌లో అందుబాటులో ఉంచేవారు. ఇప్పుడు వీటిలో ఏ ఒక్కటీ పాఠశాలలో కనిపించడం లేదు. వీటి కోసం ప్రభుత్వ నిధులు కేటాయిస్తున్నా వాటిని పాఠశాల ఇతర అవసరాల కోసం ఉపయోగిస్తున్నారు. చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేసే విద్యార్థులు తరచూ కడుపునొప్పికి గురవుతున్నారు. కడుపులో నులిపురుగులు వృద్ధి చెందడంతో పెరుగుదల లోపిస్తుంది. తరచూ విరేచనాలు, కడుపునొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో చేతుల శుభ్రత పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

గుడిపాల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పాపసముద్రం రెవెన్యూలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. రీసర్వే చేసిన తరువాత జాయింట్ ఎల్‌పీలు, కొలతల్లో తేడాలుంటే అర్జీలిస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. రీసర్వేలో తప్పిదాలను ప్రతి రైతు సరిదిద్దుకోవాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, సర్వేయర్‌లు కోటి, కిరణ్, వీఆర్ఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
APE AUTO DX CLS BS VI
2023 MODEL AP39 UQ 1708
Cell : 99594 47347
22-241/B,1st Floor, CV Division, Beside Maruthi Show Room, Kattamanchi, CHITTOOR.